

## డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



## రూ.1.11 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగల కాశీ విశ్వేశ్వరరెడ్డి దంపతులు (రావులపాలెం) రూ.1,11,116 విరాళం సమర్పించారు.

### ఉష్ణోగ్రతలు

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 40.0 | 22.0 |
| కాకినాడ | 35.7 | 24.1 |
| అమలాపురం | 36.5 | 25.0 |

## న్యూస్‌రీల్

### ఫ్లాష్.. ఫ్లాష్..

### రూ.5.60 కోట్ల సొత్తు స్వాధీనం

- లాజిస్టిక్ వాహనంలో బంగారం, వెండి వస్తువుల రవాణా
- పెద్దాపురంలో పట్టుకున్న పోలీసులు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం పోలీసులు సుమారు రూ.5.60 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ జేఎస్ రామారావు కథనం ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి బీవీసీ లాజిస్టిక్స్‌కు చెందిన వాహనంలో సుమారు 8.116 కేజీల బంగారు, 46 కేజీల వెండి వస్తువులు పట్టుబడ్డాయి. కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తూ, పెద్దాపురంలోని ఓ నగల దుకాణం నుంచి వెండి వస్తువులు తీసుకుని వెళ్తుండగా పోలీసులు అనుమానంతో ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో విషయం బట్టబయలైంది. పట్టుబడిన సొత్తుకు సరైన ఆధారాలు చూపలేదు. డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యాన ఆ సొత్తును, వాహనాన్ని సీఐ రవికుమార్, ఎస్సై వెలుగుల సురేష్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని ఆర్‌ఓ కార్యాలయానికి తరలించి, విచారణ చేపడుతున్నామని పెద్దాపురం పోలీసులు తెలిపారు.

### నేడు ఇంటర్ ఫలితాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని బోర్డు కార్యాలయంలో ఉన్నతాధికారులు విడుదల చేయనున్నారు. గత ఏడాది ఏప్రిల్ 26న విడుదల చేయగా ఈ ఏడాది 15 రోజులు ముందుగానే విడుదల చేస్తుండటం విశేషం. ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 20,215, ఒకేషనల్ 1,844 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ 20,589, ఒకేషనల్ 1,531 మంది పరీక్షలు రాశారు. గత ఏడాది ఉమ్మడి జిల్లా 8వ స్థానంలో నిలిచింది.

### మోడల్ స్కూల్ పరీక్ష హాల్ టికెట్ల విడుదల

తుని రూరల్: మండలంలోని హంసవరం ఏపీ మోడల్ స్కూల్(ఆదర్శ విద్యాలయం)లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు విడుదల చేశారు. ప్రిన్సిపాల్ పద్మజ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. దీనికి హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు, ఇంగ్లిషు మాధ్యమంలో రాయవచ్చని వివరించారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని ఆమె వివరించారు.

### వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలి

ఎస్పీ సతీష్‌కుమార్



వేళంగి చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కరప: సార్వత్రిక ఎన్నికల వేళ అంతర్ జిల్లాల చెక్‌పోస్టుల వద్ద వచ్చే, పోయే వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, మద్యం, నాటుసారా వంటివి రవాణా కాకుండా పర్యవేక్షించాలన్నారు. కాకినాడ జిల్లా, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సరిహద్దు అయిన కరప మండలం వేళంగి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం సాయంత్రం సందర్శించి, అక్కడ నిర్వహించే తనిఖీలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించి, తనిఖీల్లో సిబ్బంది అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధి విధానాలు పోలీసు సిబ్బంది, ఎస్ఎస్‌టీ బృంద సభ్యులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. స్థానిక పోలీసు అధికారులు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సక్రమంగా నిర్వహిస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ వెంట రూరల్ సీఐ కె.శ్రీనివాస్, కరప ఎస్ఐ టి.రామకృష్ణ, ఏఎస్ఐ వి.సూరిబాబు ఉన్నారు.

### నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరానికి చెందిన బి.శ్రీనివాసరావు, సత్యవేణి దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేసి, స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందుకున్నారు.

# మత్స్యకారులపై మమకారం

- వారి అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యం
- కీలక పదవుల్లో సముచిత స్థానం
- వేట నిషేధ వేళ ఐదేళ్లలో 1,23,531 మందికి లబ్ధి
- ఓఎన్‌జీసీ ద్వారా రూ.145.93 కోట్ల ఆర్థిక సాయం
- 7,050 మందికి మేలు



కాకినాడ సిటీ: మత్స్యకారుల ఓట్లకు గాలం వేసి లబ్ధి పొందడమే తప్ప వారికి తగిన గుర్తింపు నివ్వడం గాని, వారి సంక్షేమానికి పాటు పడిన పరిస్థితి గత టీడీపీ పాలకుల హయాంలో లేదు. రాజకీయంగానూ వీరికి కీలక పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చిన దాఖలాలు లేవు. ఎన్నికల ఏరు దాటడానికి వారిని వినియోగించుకుని, ఆనక వారి తెప్ప తగలేయడం ఆ పార్టీకి ఆనవాయితీగా వస్తోందన్న విమర్శలున్నాయి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రం మునుపెన్నడూ లేని విధంగా మత్స్యకారులకు పెద్ద పీట వేసింది. మత్స్యకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక పదవులు ఇస్తూ, వారి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంటున్నారు. పార్టీ పదవులే కాదు.. ప్రజాప్రతినిధులుగా గెలుపొందేందుకు కూడా అవకాశాలు కల్పిస్తున్నారు. వారు రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తున్నారు. మొట్టమొదటిగా రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పదవిని కాకినాడ జిల్లాకే కేటాయించారు. అంతే కాదు.. వారి సంక్షేమానికి సైతం పెద్ద పీట వేస్తున్నారు.

**మత్స్యకారులకు భరోసా**

వేట నిషేధ కాలంలో జిల్లాలోని 1,23,531 మంది మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా వర్తింపజేశారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.4 వేల భృతి ఇచ్చేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. రేషన్ కార్డుకు ఒకరు చొప్పున, ప్రతి మోటార్ బోటుకు యాజమానితో సహా ఆరుగురు చొప్పున, నాన్ మోటరైజ్డ్ బోటుకు యజమానితో సహా ముగ్గురు మత్స్యకారులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. 2019 నుంచి ఇప్పటి వరకూ ఏటా 24,587 మంది చొప్పున ఐదేళ్లలో 1,23,531 మందికి రూ.123.531 కోట్ల మేర ఆర్థిక సాయం అందించారు.

**ఓఎన్‌జీసీ నుంచీ పరిహారం**

ఓఎన్‌జీసీ పైపులైన్ల కారణంగా జీవనభృతి కోల్పోయిన 7,050 మంది మత్స్యకారులకు రూ.145.93 కోట్ల మేర నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ప్రభుత్వం పరిహారం జమ చేయడంతో అర్హులందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ తీరంలోని ఏటిమొగ, దుమ్ములపేట, ఉప్పలంక, పగడాలపేట, తూరంగి, సూర్యారావుపేట, నేమాం, ఉప్పాడ తదితర ప్రాంతాల మత్స్యకారులకు కూడా ఓఎన్‌జీసీ పరిహారం అందించేదుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీని కోసం ఇప్పటికే కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతలు.. ఓఎన్‌జీసీ, జిల్లా అధికారులతో పలు దఫాలు చర్చలు జరిపారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా వేట నష్టపోతున్న మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేక కమిటీని నియమించేలా చర్యలు తీసుకున్నారు.

**వేట నిషేధ వేళ మత్స్యకారులను ప్రభుత్వం ఐదేళ్లలో ఆదుకుందిలా..**

| సంవత్సరం | లబ్ధిదారులు | వేట నిషేధ భృతి (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 23,190 | 23.19 |
| 2020-21 | 24,587 | 24.58 |
| 2021-22 | 30,213 | 30.21 |
| 2022-23 | 21,394 | 21.39 |
| 2023-24 | 24,147 | 24.14 |

- ఓఎన్‌జీసీ ఆర్థిక సాయం 7,050 మందికి రూ.145.93 కోట్లు

తమకు వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనల్లో ఎవరు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారనే అంశంపై మత్స్యకారుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. జనాభా పరంగా కాకినాడ నుంచి ఉప్పాడ, కోనపాపపేట, తుని అద్దరిపేట వరకూ మత్స్యకారులు అత్యధికంగా ఉన్నారు. వీరికి గత ఐదేళ్లుగా అన్ని రకాల సౌకర్యాలనూ ప్రభుత్వం కల్పిస్తూ వచ్చింది. లక్షలాది రూపాయల ఆర్థిక సాయం అందజేసి ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కృషి చేసింది. ఈ తరుణంలో మత్స్యకారులను ఓట్ల కోసమే ఉపయోగించుకునేందుకే టీడీపీ మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### టీడీపీలో గుర్తింపేదీ?



టీడీపీ అధినేత చంద్రబాబు మత్స్యకారులను ఓటు బ్యాంకుగానే చూస్తారు. ఎన్నికల్లో మత్స్యకారులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునే వారే తప్ప ఏనాడూ తగిన ప్రాధాన్యం, గుర్తింపు ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల స్థితిగతులనే మార్చేశారు. రాజకీయంగానూ పెద్ద పీట వేస్తున్నారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా మంచి గుర్తింపునిచ్చారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇస్తున్న సాయాన్ని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. డీజిల్ సబ్సిడీ కూడా రూ.6 నుంచి రూ.9కి పెంచారు. రానున్న ఎన్నికల్లో విపక్ష కూటమి పార్టీలకు మత్స్యకారులు తగిన బుద్ధి చెబుతారు.

– బలగం ప్రసన్నకుమార్, జిల్లా మత్స్యకార నాయకుడు, మాజీ సర్పంచ్, తూరంగి

### మరెవ్వరూ ఇవ్వనంత ప్రాధాన్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులంటే ఎంతో మమకారం. ఆయన అధికారంలోకి వచ్చాక మా సంక్షేమానికి ఎంతో పాటు పడ్డారు. అంతేకాకుండా రాజకీయంగా ఎదగడానికి కూడా అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తున్నారు. చంద్రబాబు పాలనలో మత్స్యకారులకు మేలు మాట దేవుడెరుగు.. అవమానాల పాలు చేశారు. ఛీత్కారాలకు గురి చేశారు. దీనికి విరుద్ధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులతో పాటు ఇతరత్రా అనేక పదవులు ఇచ్చి గుర్తింపునిచ్చారు. టీడీపీ, జనసేనలకు సరైన బుద్ధి చెప్పేందుకు మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారు.

– వాసుపల్లి కృష్ణ, దుమ్ములపేట, కాకినాడ

### వాడుకుని వదిలేయడమే టీడీపీకి తెలుసు



మత్స్యకారులను వాడుకుని వదిలేయడమే టీడీపీకి తెలుసు. మాకు సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా.. ఓఎన్‌జీసీ, రిలయన్స్, జీఎస్‌పీసీ సంస్థల వల్ల నష్టపోతున్న మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకున్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి పదవులు కల్పించడంతో పాటు మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మొదటి చైర్మన్‌గా కాకినాడకు చెందిన మత్స్యకారుడినే నియమించారు. ఎంతో ఓటు బ్యాంకు ఉన్న మమ్మల్ని చంద్రబాబు విస్మరించారు. రాజకీయంగా వైఎస్ జగన్‌లా మరే నాయకుడూ మత్స్యకారులకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

– పినపోతు భైరవస్వామి, మట్లపాలెం కాలనీ, తాళ్లరేవు మండలం

# సామాజిక న్యాయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ నివాస్
- ఘనంగా పూలే జయంతి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నివాస్, జేసీ రామసుందర్‌రెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని, ఆయన కాంక్షించిన సామాజిక న్యాయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జె.నివాస్ కోరారు. పూలే జయంతిని పురస్కరించుకుని కాకినాడ జీజీహెచ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ ఎన్ఎస్‌వీ సత్యనారాయణ, కాకినాడ ఆర్‌డీఓ ఇట్ల కిషోర్ తదితరులు గురువారం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ, పూలే ముందుగా తన భార్యకు విద్యనందించి, ఆమె ద్వారా మహిళల విద్యా వ్యాప్తికి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సామాజిక న్యాయం అనే కొత్త ఆలోచనా విధానం తీసుకుని వచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు నడవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లా ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కలెక్టర్ నివాస్ కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.లల్లీ, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి, జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి టీవీబీ ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు మేలు చేసింది సీఎం జగనే

- మంత్రి దాడిశెట్టి రాజా
- హోరెత్తిన ఎన్నికల ప్రచారం
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 200 మంది



యర్రయ్యపేటలో మంత్రి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకారులు



అన్నయ్యపేటలో మంత్రి రాజా ఎన్నికల ప్రచారం

తొండంగి: దేశంలో ఎక్కడా లేని విధంగా మత్స్యకార భరోసా వంటి వివిధ సంక్షేమ పథకాలతో మత్స్యకారులకు లబ్ధి చేకూర్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా అన్నారు. తొండంగి మండలం యర్రయ్యపేట పంచాయతీ యర్రయ్యపేట, అన్నయ్యపేట, కొత్తపేట గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్స్యకారులకు వేట నిషేధ పరిహారాన్ని సీఎం జగన్ రూ.10 వేలకు పెంచారని చెప్పారు. వేట చేసుకునే బోట్లకు డీజిల్ రాయితీ పెంచడంతో పాటు మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేసిన ఘనత ఆయనదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఎటువంటి అజెండా లేకుండా కేవలం పేదలకు మంచి చేసిన, చేస్తున్న జగన్‌ను గద్దె దించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ జత కట్టి కుటిల యత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో వారు స్టార్ క్యాంపైనర్లను ఎన్నికల ప్రచారంలో దింపుతున్నారని, కానీ వైఎస్సార్ సీపీకి సామాన్య ఓటర్లే స్టార్ క్యాంపైనర్లని చెప్పారు.

**సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై..**

పేదల అభివృద్ధికి సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై, యర్రయ్యపేట, కొత్తపేట గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు బాదిన నాగేశ్వరరావు, బాదిన శివ, కందాల వరహాలరావు, నేమాల బుజ్జితో పాటు 200 మంది మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీ నాయకులకు అండగా ఉంటామని, పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం కోన ప్రాంత మత్స్యకార నాయకులు మంత్రి రాజాను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, ఏలేరు రిజర్వాయర్ కమిటీ చైర్మన్, ఎంపీటీసీ తోలాడ శైలాపార్వతి, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, సర్పంచ్ గరికిన అమ్మాజీ, అద్దరిపేట, ఎల్లయ్యపేట సర్పంచులు కోడా వర్మ, సింగిరి సింగారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగిరేసుపై కస్సుబుస్సులు



పార్టీ అధిష్టానం తీరుపై ధ్వజమెత్తుతున్న జిల్లా పార్టీ సీనియర్ నాయకులు

- కొత్త వారికే టిక్కెట్లు ఇచ్చారంటూ నిరసన సెగలు
- ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుని ముందే అరుపులు, కేకలు
- రాష్ట్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు రాజీనామాలు చేయాలని నినాదాలు

అమలాపురం టౌన్: డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం స్థానికంగా ఒక హోటల్‌లో జరిగిన జిల్లా కాంగ్రెస్ సమావేశం నిరసన సెగలతో సాగింది. అతిథులుగా పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్ చౌహాన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ ఎదుటే జిల్లా పార్టీ నాయకులు అధిష్టానంపై ధ్వజమెత్తారు. అమలాపురం, మండపేట తప్ప జిల్లాలోని మిగిలిన అయిదు నియోజకవర్గాల్లో కొత్త వారికే టిక్కెట్లు అమ్మేసుకుని, ఏళ్ల తరబడి పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్లను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు సర్దిచెప్పేందుకు చేసిన ప్రయత్నాలను సైతం తిప్పికొట్టారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు గౌతమ్, పద్మశ్రీ, జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు రాజీనామా చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో సమావేశం గందరగోళంగా తయారైంది. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్ ఆశించిన సీనియర్ నాయకురాలు ఇసుకపట్ల రాజేశ్వరీదేవి జిల్లాలో టిక్కెట్లు ఇచ్చిన విధానాన్ని తప్పు పడుతూ ఏఐసీసీ పరిశీలకుణ్ణి నిలదీశారు. దశాబ్దాల తరబడి పార్టీలోనే ఉంటూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చితే ఇప్పుడు ఎన్నికల సమయంలో కొత్త ముఖాలకు టిక్కెట్లు ఇచ్చేస్తే ఊరుకోబోమని అన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ టిక్కెట్లు ఆశించిన దేవరపల్లి రాజేంద్రబాబు, ముషిణి రామకృష్ణారావు, గెద్దం సురేష్‌బాబు, సత్తి బాపూజీ, జిత్తుక సత్యనారాయణ, వంటెద్దు బాబి, వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి విజయలక్ష్మి, గంటి ప్రవీణ్‌కుమార్ ఏఐసీసీ పరిశీలకుని ముందు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ అధిష్టానం నేతలను ఏకవచనంతో సంబోధిస్తూ జిల్లా పార్టీ నాయకులు శివాలెత్తారు. సమావేశం రసాభాసగా మారడంతో అర్ధాంతరంగా ముగిసింది.

### ఈద్ ముబారక్



కాకినాడ ఈద్గా మైదానంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పవిత్ర రంజాన్ మాసంలో సాగించిన కఠోర ఉపవాస దీక్షల అనంతరం ఈదుల్ ఫిత్ర్ పండగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. పలు మసీదులు, ఈద్గా మైదానాల్లో సామూహికంగా ప్రత్యేక నమాజులు నిర్వహించారు. అనంతరం పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరుణ దాతృత్వాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పండగ సందర్భంగా అల్లాహ్ కరుణతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. – కాకినాడ సిటీ

### కూటమి సమావేశానికి కిరాయికి రాలేదని ఆటో ధ్వంసం

ఉండ్రాజవరం: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమావేశానికి కిరాయికి రాలేదని టీడీపీ, జనసేన కార్యకర్తలు ఓ ఆటోను ధ్వంసం చేసిన సంఘటన ఇది. బాధితుడి కథనం ప్రకారం.. నిడదవోలులో బుధవారం సాయంత్రం జరిగిన విపక్ష కూటమి సభకు ఆటో పెట్టాలని మండలంలోని కాల్దారి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కట్టా శ్రీనును టీడీపీ, జనసేన కార్యకర్తలు కోరారు. వేరే కిరాయి ఉండటంతో రాలేనని అతడు చెప్పాడు. ఈ నేపథ్యంలో నిడదవోలు కూటమి సభ ముగిసిన తరువాత రాత్రి మద్యం తాగిన టీడీపీ, జనసేన కార్యకర్తలు శ్రీను ఆటోను ధ్వంసం చేశారు. ఆటోలోని సీట్లు, కవర్లు చింపడంతో పాటు ఆటో చుట్టూ ఆ పార్టీల జెండాలు చుట్టి వికృత ఆనందం పొందారు. రెక్కాడితేనే కానీ డొక్కాడని తనకు ఆ ఆటోయే జీవనాధారమని, వారి దాడిలో సుమారు రూ.40 వేల నష్టం జరిగిందని శ్రీను వాపోయాడు. అతడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై విచారణ చేపడతామని ఉండ్రాజవరం ఎస్సై అప్పలరాజు చెప్పారు.

## క్లుప్తంగా

### రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



సామర్లకోటలో రైలు ఢీ కొని మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

**సామర్లకోట:** స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని మూడవ నంబరు ప్లాట్‌ఫాం చివర రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం అలెప్పీ నుంచి ధన్‌బాద్ వెళుతున్న బోకారో ఎక్స్‌ప్రెస్ మూడవ నంబరు ప్లాట్‌ఫాంకు వస్తున్న సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి రైలుకు అడ్డుగా రావడంతో కుడి కాలు మోకాలు దిగువకు తెగిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని లోకో పైలట్ స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు సమాచారం ఇవ్వడంతో స్టేషన్ మేనేజర్ నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే పోలీసులు విచారణ ప్రారంభించారు. రైల్వే డాక్టర్, 108 సిబ్బంది క్షతగాత్రుడిని పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు 35 సంవత్సరాల వయసు కలిగి, చామన ఛాయగా, 5'7 అడుగుల ఎత్తు ఉన్నాడని, గ్రే కలర్ ప్యాంట్, పచ్చపై తెలుపు పసుపు అడ్డు గీతలు కలిగిన హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి నల్లని కాశీ తాడు ఉందని, రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాల కోసం 94406 27562 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



కొత్తూరు సెంటర్‌లో సీజనల్ పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి



సీమచింత కాయలు, గులాబ్ జామకాయలు



రామాఫలాలు



జొన్నాడలో ఏర్పాటు చేసిన దుకాణంలో పుచ్చకాయలను విక్రయిస్తున్న వ్యాపారి

# ఎండలు భగభగ.. అమ్మకాలు గబగబ

- జోరుగా సీజనల్ ఫ్రూట్స్ విక్రయాలు
- వినియోగదారుల్లో అమితాసక్తి
- వేసవిలో పెరిగిన డిమాండ్

**ఆలమూరు:** వేసవికాలం ప్రభావంతో ఎండలు భగ భగ మండుతున్నాయి. ఆరోగ్యాభిలాషుల ఆదరణతో మార్కెట్‌లో ఈ సీజన్‌లో లభించే వివిధ రకాల పండ్లకు డిమాండ్ అధికమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం మండలంలోని దివాన్‌చెరువు ప్రధాన కేంద్రంగా రావులపాలెం, అమలాపురం, కాకినాడ పట్టణాల్లో ఉప కేంద్రాల్లో సీజనల్ పండ్ల వ్యాపారం చురుగ్గా జరుగుతోంది. యాపిల్, డ్రాగన్, చెర్రీ, దానిమ్మ, ద్రాక్ష, కమలా ఫలాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానిక చిరు వ్యాపారులు ఆయా పట్టణాల్లోని హోల్‌సేల్ వర్తకుల నుంచి కొనుగోలు చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు రెండు టన్నుల మేర పండ్ల అమ్మకాలు సాగుతుండగా రూ.కోట్లలో టర్నోవర్ లభిస్తోంది. సీజన్‌లో మాత్రమే లభించే పుచ్చకాయ, సపోటా, రామాఫలం, గులాబీ జామ, చీమ చింతకాయలు, దోసకాయలు తదితర పండ్ల కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. శరీర దారుఢ్యానికి, ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్న వినియోగదారులు ఈ పండ్లను ధర ఎక్కువైనా కొనుగోలు చేసేందుకు వెనుకాడటం లేదు.

**పోటెత్తిన పుచ్చకాయలు**

వేసవిలో ఎక్కువగా తినే పుచ్చకాయలు మార్కెట్‌లోకి ఇప్పటికే పోటెత్తాయి. రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా ఈ దుకాణాలే కనిపిస్తున్నాయి. రంపచోడవరం, గోకవరం, ఏలేశ్వరం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో లభ్యమయ్యే రామాఫలాలను వ్యాపారులు తీసుకువస్తున్నారు. ఎరుపు, పసుపు రంగుల కలయికలో ఉండే రామాఫలంలో గుంజు మాత్రం సీతాఫలంలానే ఉన్నప్పటికీ పిండి పదార్థం ఎక్కువగా ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరమైన విటమిన్లు ఉండటంతో పాటు తియ్యగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే దొరికే వీటిని సైజును బట్టి డజను రూ.250 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని లంక భూముల్లోను, చాగల్నాడు ప్రాంతాల నుంచి సీమ చింతకాయలు తీసుకువచ్చి కిలో రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వీటికి మార్కెట్‌లో ప్రత్యేకమైన డిమాండ్ ఉంది. గోదావరి లంకల్లో ఈ సీజన్‌లో పండే దోసకాయలు, సపోటాలకు గిరాకీ ఉంది. సైజును బట్టి కాయ ఖరీదు రూ.40 నుంచి రూ.100 వరకు ఉంటుంది. చలువ చేసే వీటిని పంచదారలో కలుపుకుని తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. లంకల్లో దొరికే ఖర్బూజాలు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ. 30 వరకు ఉంటున్నాయి. కడియం ప్రాంతంలో దొరికే గులాబ్‌జామకాయలు డజను రూ.50 వరకు ఉంటున్నాయి. విజయనగరం, మన్యంలోని అల్లూరి జిల్లా నుంచి వచ్చే అనాస పండ్లు అతిచౌకగా లభిస్తున్నాయి.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ విక్రయాలు**

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో మాత్రమే లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ గ్రామీణ ప్రాంతాల్లోను లభ్య మవుతున్నాయి. సీజనల్‌గా దొరికే ఆయా రకాల పండ్లను నేరుగా పండించే ప్రాంతానికి వెళ్లి, కొనుగోలు చేసి సైకిళ్లపైనా తిరుగుతూ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. అరుదుగా లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ ఇంటి ముంగిటే లభ్యకావడంతో గ్రామీణప్రాంత వాసులు సంబరపడుతున్నారు. స్థానికంగా లభించే కొన్ని పండ్లను కోసుకుని తింటే ఉండే మజా వేరనే అభిప్రాయాన్ని గ్రామీణులు వ్యక్తం చేస్తుంటారు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అమితంగా ఉండి ఆరోగ్యానికి దోహదపడే సీజనల్ ఫ్రూట్స్‌పై అన్ని ప్రాంతాల వాసుల్లో ఆదరణ పెరుగుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూర, అంజీర తదితర డ్రైఫ్రూట్స్‌కు సీజన్‌తో నిమిత్తం లేకుండా విశేష ఆదరణ లభిస్తోంది.

**పెరిగిన గిరాకీ**



సీజనల్‌గా లభించే పండ్లను కొనుగోలు చేసేదుందుకు వినియోగదారులు అమితంగా ఇష్టపడుతున్నారు. సంవత్సరానికి కొన్ని రోజుల పాటు లభించే ఈ పండ్లు ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే వేసవిలో సీజనల్ ఫ్రూట్స్ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

– కాకి సత్యనారాయణ, పండ్ల వ్యాపారి, పినపళ్ల

**భలే రుచి**



సాధారణంగా వేసవి ప్రారంభంలో లభ్యమయ్యే సీజనల్ పండ్లు అత్యంత రుచికంగా ఉంటాయి. ఆరోగ్య సంరక్షణకు పండ్ల ధరలు ఎక్కువైనా కొనుగోలు చేయక తప్పడం లేదు.

– చిన్నం సత్యనారాయణ, వినియోగదారుడు, ఆలమూరు.

**ఆరోగ్యానికి మంచివి**



వేసవిలో లభించే సీజనల్ ఫ్రూట్స్‌లో అనేక పోషక విలువలు ఉంటాయి. వీటిని పరిమితంగా తీసుకుంటే మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతుంది. వేసవి దృష్ట్యా ఫ్రూట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఆర్.మల్లికార్జున్, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల

### నేడు కల్యాణోత్సవాలపై సమీక్ష

**ఆత్రేయపురం:** వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్నట్టు దేవాదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవాలపై సమీక్ష ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



# మా స్కూల్.. మా రూల్!

- జనసేన నేత పాఠశాలలో నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు



గొల్లప్రోలులో మాధురి పబ్లిక్ స్కూలు

**గొల్లప్రోలు:** నగర పంచాయతీలోని మాధురి ప్రైవేటు స్కూల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం రంజాన్ సెలవును గురువారం ప్రకటిస్తే బుధవారం ఆ స్కూల్‌కు సెలవు ఇచ్చేసి ఆరోజు జరపాల్సిన పరీక్షను వాయిదా వేసేశారు. తిరిగి రెండో రోజు గురువారం పరీక్ష నిర్వహించకుండా సెలవు ప్రకటించారు. ఎవరి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలకు సెలవు ప్రకటించి పరీక్షలు వాయిదా వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్కూల్ యజమాని కడారి తమ్మయ్యనాయుడు జనసేన నేత కావడంతోనే అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ 6వ తేదీ నుంచి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీసీఈబీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ జారీ చేసిన టైం టేబుల్ ప్రకారం బుధవారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో బుధవారం ఈ పరీక్ష నిర్వహించారు. మండల వనరుల కేంద్రం నుంచి డీసీఈబీ పరీక్షల పేపర్లు మాధురి స్కూల్ సిబ్బంది తీసుకొని వెళ్లినట్టు ఎమ్మార్పీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. యాజమాన్యం శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించనున్నట్లు చెబుతోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్ష పేపర్లతో యాజమాన్యం పరీక్షలు నిర్వహిస్తోందా లేదా.. అనే అనుమానం విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజు క్రితమే అన్ని పాఠశాలల్లో రాసేసిన పేపర్లతో మూడవ రోజు పరీక్షలు రాయిస్తే ఇక అది పరీక్ష ఎలా అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. విషయమై డీవైఈవో ఆర్‌జేడీ రాజు వివరణ కోరగా మాధురి స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదు చేశామన్నారు. అలసత్వం వహించిన గొల్లప్రోలు మండల విద్యాశాఖాధికారులపైనా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కొండెవరంలో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ పేలి 3 తాటాకు ఇళ్లు దగ్ధం
- సుమారు రూ.17 లక్షల ఆస్తి నష్టం



అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

**కొత్తపల్లి:** కూలి పనికి వెళ్తేగాని కుటుంబం గడవని నిరుపేదలపై అగ్ని కన్నెర్ర జేసింది. మండలంలోని కొండెవరం గొల్లపేటలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలిన కారణంగా గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు, అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం మూడు తాటాకు ఇళ్లలో మెరుకుర్తి వెంకటరమణ, మెరుకుర్తి వీరస్వామి, మెరుకుర్తి సత్తిబాబు, మెరుకుర్తి చినసుర్యనారాయణ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వెంకటరమణ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో పక్కనే ఉన్న రెండు తాటాకు పాకలు క్షణాల్లో ఒకదాని తరువాత ఒకటి అగ్నికి ఆహుతయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు ఉలిక్కిపడ్డారు. పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సుమారు రూ.17 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులు బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించే నిత్యావసర వస్తువులను అందజేశారు.

### దిండి టూరిజం కేంద్రం స్కాంలో ఐదుగురి సస్పెన్షన్

**మలికిపురం:** ప్రముఖ పర్యాటక కేంద్రం దిండి టూరిజం కేంద్రంలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఐదుగురు ఉద్యోగులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మేనేజరు ఫణీంద్రతో పాటు ఉద్యోగులు పసుపులేటి సత్యనారాయణ, పుల్లారావు, రాజు, దుర్గారావులను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# వైఎస్సార్ సీపీకి రెడ్డి సామాజిక వర్గం అండ

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

**అనపర్తి:** మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు అవకాశవాద రాజకీయాలు అలవాటేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక అధికారం కోసం బీజేపీ, జనసేనతో అనైతిక పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. రెడ్డి వ్యతిరేకి చంద్రబాబు అని, టీడీపీ హయాంలో రెడ్లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గీయులను ద్వేషించే చంద్రబాబు తాను అధికారంలో ఉండగా తన సామాజిక వర్గం వారిని ప్రాధాన్యం కలిగిన ప్రభుత్వశాఖల్లో నియమించారన్నారు. ప్రాధాన్యం లేని పోస్టుల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించారని, ఇది నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉండగా రెడ్లను అన్ని రంగాల్లో అణిచివేసిందని, కాల్‌మనీ వ్యవహారంలో రెడ్డి సామాజిక వర్గీయులనే టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలిచారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, ఈ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గీయులు ప్రత్యేక పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, వల్లభశెట్టి సతీష్, జీఎల్ రవిశంకర్, కొండేటి భీమేష్ పాల్గొన్నారు.

# అరుదైన చేప.. ఎగరడమే చేవ!



కాకినాడలో తూనీగ చేప



చేప పొడవాటి రెక్కలను చూపుతున్న మత్స్యకారుడు

**కాకినాడ రూరల్:** ఈ చిత్రంలోని చేప పేరు తూనీగ.. ఈ చేప ప్రత్యేక ఏమిటంటే సముద్రపు నీటిలో ఈద గలదు. గాలిలో ఎగర గలదు. ఈ చేపలు గుంపులుగా సముద్రంలో ఎగురుతూ వెళుతుంటే నయనానందకరమే. నీటి పై నుంచి గాలిలో చాలాదూ రం ఎగరడంతో ఈ చేపలను తూనీగ అని పిలుస్తా రని మత్స్యకారులు చెబుతారు. గాల్లో ఎగిరేందుకు అనుగుణంగా వీటి రెక్కలు పొడవుగా ఉంటాయి.